క్లుప్తంగా

ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరం



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు విజయ్

సత్యవేడు: ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరమవుతుందని ఫిజియోథెరపిస్ట్ విజయ్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఫిజియోథెరపీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవితా కేంద్రంలో నిర్వహించే ఫిజియోథెరపీ శిబిరాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా భవిత కేంద్రాన్ని ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ రవి పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పరికరాలతో ఐఈఆర్‌టీలు విద్యను అందించారు.

డాక్టర్లకు సన్మానం



బదిలీ అయిన డాక్టర్ గుణశేఖర్‌ను సన్మానిస్తున్న వైద్యసిబ్బంది

సత్యవేడు: దాసుకుప్పం ప్రాథమిక కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్లు గుణశేఖర్, మురళీకృష్ణ ఉన్నత చదువులకు పీహెచ్‌సీ నుంచి బదిలీ కావడంతో ఇద్దరు డాక్టర్లను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, సబ్‌యూనిట్ ఆఫీసర్ మోహన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులకు వినతి



ఈఓకు వినతి పత్రం ఇస్తున్న జూలియన్ రాజు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంటలోని జీఎం రోడ్డు నుంచి డాక్టర్ బ్రహ్మానందం హాస్పిటల్, తపస్య పాఠశాలకు వెళ్లే దారికి స్లోప్ వేయాలని ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు కోరారు. మంగళవారం ఆయన పంచాయతీ సెక్రటరీ మణికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం జూలియన్ రాజు మాట్లాడుతూ వీధిలో పాఠశాల ఉండడం వల్ల అనేక మంది పిల్లలు అక్కడ కింద పడిపోతున్నారని అన్నారు. రెండు రోడకలే కలిసే చోట మరమ్మతులు చేయాలని కోరారు. పంచాయతీ అధికారులు చొరవ తీసుకుని సమస్య పరిష్కరించాలని తెలిపారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్ల పల్లకీ సేవ జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలోని స్టేట్‌బ్యాంకు ఐదు శాఖల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ భక్తులకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అధికారులు అరుణకుమార్, వెంకటపతి, ఐదుశాఖల మేనేజర్లు, ఉద్యోగులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న రేణిగుంట సీఐ, ఎస్ఐ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): మండలకేంద్రం రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జిలను, వాహనాల తనిఖీ చేపట్టారు. మంగళవారం రాత్రి సాధారణ తనిఖీల్లో భాగంగా అర్బన్ సీఐ శరత్ చంద్ర, ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి సిబ్బందితో కలిసి పట్టణంలోని పలు లాడ్జిలను తనిఖీలు చేశారు. లాడ్జిల నిర్వహణ రిజిస్టర్లను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని కరకంబాడి, రమణ విలాస్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్‌లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కొత్త ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ కోరారు.

మురుగు.. జనం పరుగు

- చెన్నవారిపాళెం దళితవాడలో ఇళ్ల మధ్యనే మురుగు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని యంత్రాంగం



చెన్నవారిపాళెం దళితవాడలో వీధుల వెంబడి నిల్వ ఉన్న మురుగునీరు

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ పరిధిలోని చెన్నవారిపాళెం దళితవాడలో అంతటా సమస్యలు నెలకొన్నాయి. నిధులు ఉన్నా మేజర్ పంచాయతీ పరిధిలో దళితవాడ ఉన్నప్పటికీ అభివృద్ధి మాత్రం శూన్యం. వీధుల్లో మురుగునీరు బయటకు వెళ్లలేక కాలువల్లో నిల్వ ఉంటోంది. కాలువల నిర్మాణం ఊసే లేదు. దీని కారణంగా దోమలు విస్తరించి స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారు. అంతేకాక తాగునీరు సరఫరా అయ్యే పంచాయతీ కొళాయిల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. ఒక్క కొళాయికి కూడా సరైన బిరడాలు లేవు. దీంతో తాగునీరు లీకేజీ అవుతూ వృథాగా పోతోంది. మురుగునీటి సమస్యలపై పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీలో నిధులు ఉన్నప్పటికీ తమ కాలనీ అభివృద్ధి గురించి ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. పారిశుద్ధ్య సమస్యలు అలాగే ఉంటున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.





చెన్నవారిపాళెం దళితవాడలో మురుగునీటి కాలువలు లేక నిల్వ ఉన్న మురుగునీరు, కొళాయిలకు బిరడా లేక వృథాగా పోతున్న తాగునీరు

ప్రజలకు సమాధానం చెప్పేవారు లేరు



మాట్లాడుతున్న భాస్కర్ రెడ్డి

వరదయ్యపాళెం: తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉండడం లేదని, కనీసం కార్యాలయానికి వెళ్లే అర్జీదారులకు సమాధానం ఇచ్చే అధికారి కరువయ్యారని జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు భాస్కర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ.. మంగళవారం రోజున పలువురు అర్జీదారులు కార్యాలయానికి వెళ్తే తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలు లేరని తెలిపారు. ఇటీవల సత్యవేడు మండలానికి వరదయ్యపాళెం తహసీల్దార్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించడంతో ఆయన వారంలో ఒకటి, రెండు రోజులు కూడా కార్యాలయానికి రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాక పనుల కోసం పలువురు కాళ్లరిగేలా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పనులు జరగడం లేదని ఆయన వాపోయారు. ప్రశ్నిస్తే అటు కోర్టు కేసులు, ఇటు పక్క మండలం ఇన్‌చార్జ్ బాధ్యతల్లో బిజీగా ఉన్నట్లు చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే అధికారులు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఐటీఐ కళాశాల అభివృద్ధికి ఐమాప్ చేయూత



ఐటీఐ కళాశాలలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఐమాప్ పరిశ్రమ ఎండీ టైజో ఇవామి, శ్రీసిటీ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి

- రూ.7.5 లక్షలతో తరగతి గదుల ఆధునీకరణ
- లాంఛనంగా ప్రారంభించిన ఐమాప్ ఎండీ ఇవామి



శ్రీసిటీ ఐమాప్ పరిశ్రమ నిధులతో అభివృద్ధి చేసిన తడ ఐటీఐ కళాశాల తరగతి గదులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): తడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల అభివృద్ధికి శ్రీసిటీలోని ఐమాప్ (ఇండియ మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్) పరిశ్రమ వారు చేయూతనిచ్చారు. సీఎస్ఆర్‌లో భాగంగా పరిశ్రమ ద్వారా రూ.7.5 లక్షలతో అధ్వాన స్థితిలో ఉన్న 3 తరగతి గదులకు మరమ్మతులు చేపట్టి ఆధునీకరించారు. ఈ సందర్భంగా ఆధునీకరించిన గదులను మంగళవారం శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి, ఐమాప్ మేనేజింగ్ డైరెక్టర్ టైజో ఇవామి, పరిశ్రమ ఉన్నతాధికారుల సమక్షంలో లాంఛనంగా ప్రారంభించి కళాశాల ప్రిన్సిపల్ దేవదానంకు అప్పగించారు. ఈ సందర్భంగా ఐమాప్ ఎండీ మాట్లాడుతూ స్థానిక విద్యాసంస్థల మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ఐమాప్ మరిన్ని కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అనంతరం ఐమాప్ చొరవను శ్రీసిటీ డైరెక్టర్ నిరీషా అభినందించారు. శ్రీసిటీ ప్రత్యేక చొరవకు పరిశ్రమల యాజమాన్యాలు చురుకైన భాగస్వామ్యం తోడై శ్రీసిటీ ప్రగతిలోని ప్రభుత్వ విద్యాసంస్థల మౌలిక సదుపాయాలు చాలా వరకు మెరుగుపడుతున్నట్లు ఆమె తెలిపారు. తద్వారా విద్యార్థుల నమోదు శాతం విద్యా ఫలితాల్లో మంచి పురోగతిని సాధించవచ్చని చెప్పారు. గత ఐదేళ్లలో శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో పలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర వసతుల కల్పనకు ఐమాప్ పరిశ్రమ తమ సీఎస్ఆర్ నిధులలో రూ.కోటి ఖర్చు చేయడం ఎంతో గర్వించదగ్గ విషయమని ఆమె తెలిపారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు



క్యారమ్స్ ఆడుతున్న మహిళలు

తిరుపతి కల్చరల్ : టీటీడీ ఉద్యోగులకు నిర్వహిస్తున్న క్రీడాపోటీలు మంగళవారం హోరాహోరీగా సాగాయి. మహిళా అధికారుల టెన్నికాయిట్ సింగిల్స్‌లో కుమారి దేవి విన్నర్‌గా, దామర సెల్వి రన్నరప్‌గా నిలిచారు. డబుల్స్‌లో కుమారి దేవి, దామర సెల్వి విజయం సాధించగా, రమాదేవి, నారాయణమ్మ రన్నరప్‌గా నిలిచారు. అలాగే పురుష ఉద్యోగుల బాల్ బ్యాడ్మింటన్‌లో సుభాష్ చంద్రబోస్ విజేతగా మహేష్ రన్నరప్‌గా నిలిచారు. ప్రత్యేక ప్రతిభావంతుల పురుష ఉద్యోగుల బాల్ బ్యాడ్మింటన్‌లో బాబు విజేతగా నిలవగా, మధుసూదన్ శర్మ రన్నర్‌గా నిలిచారు. ప్రత్యేక ప్రతిభావంతుల మహిళా ఉద్యోగుల పోటీలలో గౌరీ విజయం సాధించగా, కుమారి రన్నర్‌గా నిలిచారు. అలాగే మహిళా ఉద్యోగుల క్యారమ్స్ సింగిల్స్‌లో స్వప్న మంజరి విజయం సాధించగా, సుధారాణి రన్నర్‌గా నిలిచారు. క్యారమ్స్ డబుల్స్‌లో సులోచన రాణి, స్వప్నకుమారి విజేతలుగా, రాజేశ్వరి, సుధారాణి రన్నర్‌గా నిలిచారు.

ఏపీ పీజీ సెట్‌ను రద్దు చేయండి

శ్రీకాళహస్తి : ఏపీ పీజీ సెట్ పరీక్షను రద్దు చేయాలంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభుత్వానికి సూచించారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. పీజీ సెట్ వల్ల ఆయా యూనివర్సిటీలకు స్వయం ప్రతిపత్తి తగ్గిపోయి అడ్మిషన్లు పడిపోయే ప్రమాదం ఉందని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు చుట్టు గురవయ్య ఆందోళన వ్యక్తం చేశారు. పీజీ సెట్ నిర్వహణను వర్సిటీలకే అప్పగిస్తే అడ్మిషన్లు పెరిగి పేద విద్యార్థులు సైతం ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డేవిడ్, ప్రవల్లిక, కావ్య, ప్రియాంక, యామిని పాల్గొన్నారు.

కృష్ణంపల్లి వీఎస్ఎస్ చైర్మన్‌గా రవికుమార్



అక్కుపల్లి రవికుమార్

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం కృష్ణంపల్లి వనసంరక్షణ సమితి(వీఎస్ఎస్) చైర్మన్‌గా అక్కుపల్లి రవికుమార్ ఎన్నికయ్యారు. డీఆర్ఓ సికిందర్ పర్యవేక్షణలో మండలంలోని కృష్ణంపల్లిలో మంగళవారం వీఎస్ఎస్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కమిటీ చైర్మన్‌గా అక్కుపల్లి రవికుమార్, వైస్ చైర్మన్‌గా ఆర్.సరోజ, 15 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కృష్ణంపల్లి సెక్షన్ పరిధిలో అటవీ సంరక్షణ, అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేస్తుందని చైర్మన్ తెలిపారు.

లైన్‌మెన్‌కు ప్రశంసాపత్రం



ఎస్ఈ సురేంద్ర నాయుడు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ప్రవీణ్ కుమార్

వరదయ్యపాళెం: విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన కడూరు సచివాలయం జూనియర్ లైన్‌మెన్ వెట్టి ప్రవీణ్ కుమార్‌కు జాతీయ లైన్‌మెన్ దినోత్సవం సందర్భంగా పుత్తూరులో జరిగిన కార్యక్రమంలో ఎస్ఈ సురేంద్ర నాయుడు చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ప్రతిఒక్కరూ ఇదే స్ఫూర్తితో విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో పుత్తూరు ఈఈ దేవఆశీర్వాదం, నాగలాపురం డీఈఈ రమేష్, వరదయ్యపాళెం మండల ఏఈ విజయ్ వెంకటేష్‌లు ఉన్నారు.

సారాకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ శ్యాంప్రసాద్

నారాయణవనం: సారా తయారీ, విక్రయాలకు, సేవించడం వంటి వాటికి దూరంగా ఉండాలని పుత్తూరు ఎక్సైజ్ సీఐ శ్యాంప్రసాద్ అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం మండలంలోని కీళగరం దళితవాడ వాసులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆదాయం కోసం సారా తయారు చేస్తున్నారే తప్ప, ఇతరుల ఆరోగ్యంతో పాటు కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్న వాస్తవాన్ని గ్రహించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సారాతో జీర్ణకోశ, నాడీమండల వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందన్నారు. ముఖ్యంగా మహిళలు భర్తలను, పిల్లలను కట్టడి చేయడంతో సారా తయారీ, విక్రయాలను పూర్తిగా అరికట్టవచ్చని తెలిపారు. అనంతరం అందరితో సారాకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రవి, ఎక్సైజ్ ఎస్ఐలు అంజద్‌బాష, శివప్రసాద్, మహిళలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరశురామేశ్వరుడి సేవలో ప్రముఖులు



గుడిమల్లం ఆలయాన్ని సందర్శిస్తున్న యూనియన్ బ్యాంకు ఎండీ

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన శ్రీ పరశురామేశ్వర స్వామిని మంగళవారం యూనియన్ బ్యాంకు ఎండీ, సీఈఓ ఏ.మణిమేఖలై దర్శించుకున్నారు. వారికి ఆలయ మాజీ చైర్మన్ బత్తలగిరి నాయుడు, ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి దర్శనం, ఆలయ విశిష్టతను తెలియజేసి వారికి ప్రసాదాలు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో పాపానాయుడుపేట యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ఆంజనేయులు, యూనియన్ బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను మార్చి 31లోగా వృద్ధిలోకి తీసుకురావాలని సూళ్లూరుపేట డీఎల్‌పీఓ రవీంద్రనాథ్ తెలిపారు. ఆయన మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా ఇంటింటి నుంచి చెత్త సేకరణ-చెత్త నుంచి సంపద తయారీపై గ్రామ సర్పంచ్‌లకు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, ఇంటింటి నుంచి చెత్త సేకరణపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సర్పంచ్, గ్రామ కార్యదర్శి కలిసి కట్టుగా పని చేసి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వృద్ధిలోకి తీసుకురావాలన్నారు. భూమిలో కలిసి కుళ్లిపోయే పదార్థాలన్నీ తడి చెత్త కిందకు వస్తాయని, భూమిలో కలిసిపోని పదార్థాలన్నీ పొడి చెత్త కిందకు వస్తాయని, దీని ఆధారంగా ప్రజలు ఇంట్లోనే చెత్తను వేరు చేసి రిక్షాల్లో వేసేలా చూడాలని తెలిపారు. ఇళ్ల నుంచి చెత్తను సేకరించి తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి సంపద తయారీ కేంద్రాల్లో వర్మీ కంపోస్టును తయారు చేయాలని తెలిపారు. సంపద తయారీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచి చెట్లను పెంచి, పార్కులుగా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఈఓపీఆర్‌డీ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా



రోడ్డుపై నిలిపి ఉన్న వాహనదారుడిని హెచ్చరిస్తున్న ఎస్ఐ విశ్వనాథనాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని ప్రధాన రహదారిపై రోడ్డుపై వాహనాలను నిలపకూడదని, వాహనాలు నిలుపుతుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. ఆయన మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగలో మెయిన్‌రోడ్డుపై నిలిపిన వాహనాలకు జరిమానా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోవాలాలు మెయిన్‌రోడ్డులో అడ్డదిడ్డంగా పెడుతున్నారని, దీంతో షాపు యాజమానులు, లారీ, బస్సుల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆటోవాలాలు ఆటోలను ఎక్కడపడితే అక్కడ పెట్టకూడదన్నారు. షాపుల వద్దకు సరుకుల కోసం వస్తున్న ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై పెట్టకూడదని తెలిపారు. వాహనదారులు మెయిన్‌రోడ్డులో వాహనాలను నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బాలికలకు అవగాహన



మాట్లాడుతున్న సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: యుక్త వయస్సు బాలికల సమతుల పోషకాహారం గురించి మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వైద్యాధికారి విద్యాసాగర్ అధ్యక్షతన ఆశా కార్యకర్తలకు ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి విద్యాసాగర్ మాట్లాడుతూ ఆడ పిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాత వివాహం చేయాలని అనే విషయాన్ని తల్లిదండ్రులకు విరివిగా తెలియజేయాలని తెలిపారు. ఆడబిడ్డను బతకానిద్దాం, ఆడబిడ్డను చదివిద్దాం అనే నానుడిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు. ప్రతి గ్రామంలో యుక్త వయసు బాలికల తల్లిదండ్రులను సమావేశ పరచి బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం పనుల్లో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు: పారిశుద్ధ్యం పనుల్లో అలసత్వం వద్దని ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదేశించారు. మంగళవారం ఆయన సచివాలయ కార్యదర్శులతో తన కార్యాలయంలో సమీక్షించారు. ప్రతి ఇంటి వద్ద తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. ఆర్థిక సంవత్సరం పూర్తి కావస్తున్నందున పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పీ4 సర్వే, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సర్వే, వర్క్ ఫ్రం హోం సర్వే, చైల్డ్ ఆధార్ సర్వే సమగ్రంగా చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీలలో వేలంపాట సకాలంలో నిర్వహించి పంచాయతీలకు ఆర్థిక వనరులుల సమకూర్చుకునేందుకు కార్యదర్శులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ తరుణాక్షరెడ్డి, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఆటలపోటీలు



ఆటల పోటీల్లో పాల్గొన్న అంగన్‌వాడీ వర్కర్లు

శ్రీకాళహస్తి: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని సీడీపీఓ కార్యాలయం వద్ద మంగళవారం అంగన్‌వాడీలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో రన్నింగ్, మ్యూజికల్ చైర్స్, లెమన్, స్పూన్, రంగోలి, సింగింగ్ పోటీలు జరిగాయి. విజేతలకు సీడీపీఓ శాంతిదుర్గ బహుమతులు అందజేశారు.


ఇంటి స్థలాలు ఇవ్వాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజన మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కొత్తపాళెం గ్రామానికి చెందిన గిరిజన మహిళలు తమకు ఇంటి స్థలాలు ఇవ్వాలని తహసీల్దార్ సుబ్రమణ్యంకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 కుటుంబాలకు చెందిన వారికి ఇంటి స్థలాలు లేక నానా అవస్థలు పడుతున్నామని వాపోయారు. ఒకే ఇంటిలో మూడు కుటుంబాల వారు నివాసం ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సుబ్రమణ్యం మాట్లాడుతూ గ్రామంలోని ప్రభుత్వ భూమిని గుర్తించి, ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బరత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పల్లకీపై ఆదిదంపతులు







శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివపార్వతులు పల్లకీపై దర్శనమిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా స్వామివారి ఊరేగింపులో అశేష జనవాహిని పాల్గొన్నారు. ఆదిదంపతులను దర్శించుకుని ఉప్పొంగిపోయారు.

- శ్రీకాళహస్తి